క్లుప్తంగా

నేడు పొదుపు మహిళలతో ఎమ్మెల్యే సమావేశం

ఆత్మకూరు: మండలంలోని పొదుపు మహిళలతో సంక్షేమ పథకాల అమలు తీరుపై ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమావేశం నిర్వహించనున్నారని మున్సిపల్ కమిషన్ బి.నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం (పొదుపు కార్యాలయం)లో మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే సమీక్ష నిర్వహిస్తారన్నారు. పొదుపు సంఘాల మహిళలు, లీడర్లు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియ

ఉదయగిరి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు ఆధార్ అప్‌డేషన్ కార్యక్రమం జరుగుతుందని ఇన్‌చార్జి మల్లికార్జునరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ అప్‌డేషన్ కార్యక్రమంపై గ్రామాల్లో వలంటీర్ల ద్వారా తెలియజేయాలన్నారు. ప్రజలకు వెల్ఫేర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తెలియజేసేలా చూడాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

ఖాతాదారుల సేవా కేంద్రం ప్రారంభం



ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బ్రాంచ్ మేనేజర్

చేజర్ల(సోమశిల): మండలంలోని సోమశిల బస్టాండ్ సెంటర్‌లో సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల కేంద్రాన్ని సోమశిల బ్యాంక్ మేనేజర్ కళాధర్ ప్రారంభించారు. మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సోమశిలలో రెండో సెంటర్ ప్రారంభించామన్నారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నరు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

ఉదయగిరి: 18 ఏళ్లు నిండకుండా బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సీడీపీఓ పచ్చవ లావణ్య అన్నారు. ఆమె సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో ఎక్కడైనా 18 ఏళ్లలోపు బాలికలకు బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సంబంధిత సచివాలయాల మహిళా సంరక్షణ, పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్యవివాహాలు జరిపితే చట్ట ప్రకారం నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

కిరాణా దుకాణంలో చోరీ



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి: పట్టణంలోని మసీదు కాంప్లెక్‌లోని ఓ కిరాణా దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కాంప్లెక్స్‌లోని ఓ దుకాణంలో రంగయ్య అనే వ్యక్తి కిరాణా వ్యాపారం నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే ఆదివారం రాత్రి దుకాణం మూసి ఇంటికెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి దుకాణం తెరవగా దుకాణంలోని వెనుక వైపు గోడ పగులగొట్టి దుండగులు లోనికి ప్రవేశించినట్లు గుర్తించారు. సుమారు రూ.15 వేలు నగదు, సిగరెట్ ప్యాకెట్లు, చిల్లర వస్తువులు చోరీకి గురయ్యాయని బాధితుడు పోలీసులకు తెలిపాడు. ఎస్సై కర్నాటి ఇందసేనారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగ యువతులకు ఉపాధి అవకాశాలు

వరికుంటపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబాల్లోని యువతులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఇన్‌చార్జి ఏపీఓ వి.శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఉన్నతి' కార్యక్రమంలో భాగంగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన వారికి వారు కోరుకున్న రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ సమయంలో వసతితో పాటు, భోజన సదుపాయం, రోజు వారి ఉపాధి కూలీ వేతనం రూ.272 ఇస్తారన్నారు. మూడు బృందాలుగా నిర్వహించే ఈ శిక్షణలో ఒక్కో బృందానికి 25 మంది యువతులు ఉంటారన్నారు. 18–35 ఏళ్లు కలిగిన యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కళ్ల ముందు గ్రామ స్వరాజ్య పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పాలన కోసం తరతరాలుగా కలలు కంటూనే ఉన్నారు. అటువంటి గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్ల ముందు ఆవిష్కరించారు' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌరవరంలో సోమవారం ప్రభుత్వ భవనాల సముదాయాన్ని ప్రారంభించాక విలేకరులతో మాట్లాడారు. మన ముఖ్యమంత్రి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో గడిచిన నాలుగేళ్లలో గ్రామ స్వరాజ్యాన్ని సార్థకం చేశారన్నారు. బ్రాడ్‌బ్యాండ్ సదుపాయంతో నిర్మిస్తున్న డిజిటల్ లైబ్రరీలు కూడా గ్రామాల్లో మన కళ్ల ఎదుటే ఉన్నాయని తెలిపారు. 76 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో మరే ప్రభుత్వం చేయలేని విధంగా ఒకే ఒక్క సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చేసి చూపించడం గొప్ప మార్పు అన్నారు. జనన, మరణ, కుల, ఆదాయ సర్టిఫికెట్, పింఛన్, రేషన్, ప్రభుత్వ పథకాలు.. ఇలా ఏది కావాలన్నా ఎక్కడెక్కడో ఉన్న కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితిని పూర్తిగా మార్చివేసి పౌర సేవల్ని ఇంటింటికీ వెళ్లి తలుపు తట్టి, చిక్కటి చిరునవ్వుతో సేవలు అందించే సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చారని ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్రంలో రైతన్నలకు ప్రతి ఏటా రూ.13,500 చొప్పున రైతు భరోసా పెట్టుబడి సాయంగా జగనన్న ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. విత్తనం నుంచి పంట అమ్మకం వరకు రైతుకు తోడుగా ఉండేలా, దేశానికే ఆదర్శంగా నిలిచేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతన్నను చేయిపట్టుకుని నడిపిస్తున్న వైఎస్ జగనన్న ప్రభుత్వమనే విషయాన్ని గమనించాలన్నారు. పంటల బీమాగా రైతన్న ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా, మొత్తం పంటల బీమాను వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్ ముగిసేలో గానే రైతులకు నష్ట పరిహారం అందిస్తున్న దేశంలోనే ఏకైక ప్రభుత్వం జగనన్నదే అని చెప్పారు. 100 ఏళ్ల తర్వాత సమగ్ర భూ సర్వే చేసి, రికార్డులు అప్‌డేట్ చేసి ఇక భూ వివాదాలకు స్వస్తి పలుకుతూ పూర్తి హక్కులతో రైతులు, భూ యజమానుల చేతిలో ఉంచుతున్న జగనన్న ప్రభుత్వమని తెలిపారు. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూముల సాగు హక్కుదార్లకు వాటి మీద పూర్తి హక్కులు కల్పించడం ద్వారా యజమానులుగా చేయడం, ఇందులో ప్రధానంగా ఎస్సీ, బీసీ వర్గాల వారే ఎక్కువగా లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. ఎస్టీ రైతులకు డీకేటీ/ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాగా ఇవ్వడం జరిగిందని, చుక్కల భూముల జాబితా నుంచి రైతులకు చెందిన భూముల్ని తొలగించి వారిని పూర్తి హక్కుదార్లుగా మార్చడం జరిగిందని చెప్పారు. వీరితో పాటు షరతులు గల పట్టా కలిగిన రైతులకు పూర్తి హక్కులు కల్పించినట్లు వివరించారు.

నూతన భవనాలు ప్రారంభం



నూతన భవనాల సముదాయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ శీనానాయక్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంలో భాగంగా మండలంలోని గౌరవరంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను సోమవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. రూ.79.30 లక్షలతో నిర్మించిన ఈ భవనాలను నిర్మించారు. కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్, తహసీల్దార్ కె.మాధవరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, ఎంపీపీ ఆలూరు కొండమ్మ, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, శ్రీశైలం ఆలయ పాలక మండలి ప్రత్యేక ఆహ్వానితుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ చింతం తిరుముల రాణి, ఎంపీటీసీ సభ్యురాలు చింతం రమణమ్మ, సర్పంచ్ దేవరపల్లి రాధిక, ఉప సర్పంచ్ సురే శ్రీలత, నాయకులు కున్నం వెంకట్రామిరెడ్డి, చింతం బాబుల్‌రెడ్డి, పలకా శ్రీధర్‌రెడ్డి, సురే శ్రీనివాసులురెడ్డి, సురే జయశ్రీ, దేవరపల్లి మహేంద్ర, చెన్ను ప్రసాద్‌రెడ్డి, నాయుడు రాంప్రసాద్, నాగనగారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు ఏర్పాటు

ఆత్మకూరురూరల్: ఈ నెల 31న పౌర్ణమిని పురస్కరించుకుని ఆత్మకూరు నుంచి అరుణాచలానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశామని ఆత్మకూరు డిపో మేనేజరు కరీమున్నీసా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాను, పోను టికెట్ ధర రూ.1,400 నిర్ణయించామని తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఉదయం 8 గంటలకు ఆత్మకూరు నుంచి ఈ బస్సు బయలుదేరుతుందన్నారు. మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం దేవాలయాలను కూడా భక్తులు చూసే అవకాశం ఉందన్నారు. ఇతర వివరాలకు డిపో మేనేజరు సెల్ నంబరు 9959225645, సీఐ కల్పన సెల్ నంబరు 9966009395, బస్సు కండక్టర్ సుబ్బయ్య నంబరు 8555929504లో సంప్రదించాలన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఒరిగిన విద్యుత్ స్తంభం

ఆత్మకూరు: పట్టణంలో మెయిన్ బజారులోని సాయి బాబా మందిరం ఎదురు వైపు పొట్టు తరలించే ఓ లారీ విద్యుత్ స్తంభానికి తగలడంతో అది సగం వరకు ఒరిగింది. దీంతో విద్యుత్ తీగల ఆధారంగా అది నిలబడడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ప్రమాదకరంగా ఉన్న విద్యు త్ స్తంభానికి సోమవారం తాత్కాలికంగా సపో ర్టు కర్ర ఏర్పాటు చేశారు. నూతన స్తంభం ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ సిబ్బంది తెలిపారు.

ఏ ఎన్నికలైనా వైఎస్సార్‌సీపీదే హవా

- ఉప ఎన్నికల్లో గెలిచిన పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లు



విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్, వార్డు మెంబర్లు

ఆత్మకూరు: అనేక సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనతో రాష్ట్రంలో జరిగే ఏ ఎన్నికల్లోనైనా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రజల మద్దతుతో హవా కొనసాగిస్తున్నారని ఇటీవల గెలిచిన ఏకగ్రీవ సర్పంచ్, పలు పంచాయతీల వార్డు మెంబర్లు అన్నారు. ఇటీవల ఐదు మండలాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో చెర్లోయడవల్లి పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చేరెడ్డి ప్రభావతమ్మ, పలు వార్డు మెంబర్లు సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, దీంతో సుభిక్షంగా ఉన్నారన్నారు. ఉప పోరులో ప్రతిపక్షం కనీసం పోటీ చేసే పరిస్థితి కూడా లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిమలూరు, మినగల్లు, మాముడూరు, కోటితీర్థం, పాతపాడు, చిరమన, వేల్పులగుంట, జమ్మవరం, పడమటినాయుడుపల్లి, పంచాయతీల వార్డు మెంబర్లు మూరంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, గొర్సిపాటి అశోక్, కరేటి సుశీలమ్మ, నూలు మంగమ్మ, షేక్ మస్తాన్ బీ, కొప్పోలు వెంకటేశ్వర్లు, మండవ లక్ష్మి, గోళ్ల పెద్దవీరయ్య, కప్పల రాధ, పడచల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అందరికి లబ్ధి

- ఏడీఎఫ్‌తో నియోజకవర్గ అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ నేతలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని, ఆయన పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని సంగం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 'మాట ఇస్తే ఇక తప్పడు' అని రాష్ట్ర ప్రజలంతా విశ్వసిస్తున్నారన్నారు. విద్యాభివృద్ధి కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని, పేద విద్యార్థులకు విలువైన ఆస్తి ఒక్క విద్య మాత్రమేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటుంటారని, ఆ దిశగా అన్ని రకాలుగా వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. రెవెన్యూ వ్యవస్థలో సరికొత్త జీఓలతో వేలాది రైతు కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతున్నారన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు ప్రజలందరికీ సంపూర్ణంగా చేరాయని, 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ఉన్నారన్నారు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి కోసం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేశారని, ప్రతి మండలంలో సమస్యలను క్షుణ్ణంగా పూర్తి అవగాహనతో పరిష్కరిస్తారన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా గుర్తించిన రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం అనేక సార్లు రివ్యూ సమావేశాలు నిర్వహించడంతో పాటు కలెక్టర్, తహసీల్దార్లతో సమీక్షలు నిర్వహించి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఉన్నత విద్యావంతుడైన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విద్యార్థుల కోసం ఏడీఎఫ్ ద్వారా డిజిటల్ క్లాస్‌రూంలు, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయిస్తున్నారని, చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి ద్వారా శిక్షణ అందించి వారికి ఉద్యోగాల కల్పన కోసం కృషి చేస్తున్నారని వివరించారు. వచ్చే 2024 ఎన్నికల్లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పులగం శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, సూరి మదన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ మానికల చందన్ కుమార్, నేతలు కరిముల్లా, గుండాల బాలచంద్రారెడ్డి, ఫణికుమార్‌రెడ్డి, పట్టాభి, జహంగీర్, జనార్దన్‌రెడ్డి, రామారావు తదితరులు ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై సమీక్ష



మాట్లాడుతున్న అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంపై ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఈఓ 1, 2 నజీర్‌బాషా, చలపతి మాట్లాడుతూ మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యాశాఖకు సంబంధించిన ఎంఆర్‌పీలు ఈ కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. 17 ఏళ్లు నిండిన వారు మాత్రమే ఈ ఆటల పోటీలకు అర్హులని తెలిపారు. క్రీడాకారులు తమకు నైపుణ్యం ఉన్న ఆటల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ ఏడాది అక్టోబరు 2 నుంచి క్రీడా పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి క్రీడాకారుడు వారికి సంబంధించిన గ్రామ సచివాలయాల్లో మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రధానంగా క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ తదితర క్రీడలకు సంబంధించి క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల భూములను కాపాడండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఉదయగిరి: పేదలకిచ్చిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూసి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీపీఎం ఆధ్వర్యంలో పలువురు రైతులు ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో పేద ప్రజలకు ప్రభుత్వం భూ పంపిణీలో భాగంగా భూములు మంజూరు చేసి పట్టాలు కూడా అందజేసిందన్నారు. ఆ భూములను పేద ప్రజలు సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే కొంతమంది పెత్తందారులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆ పొలాల్లో బోర్లు వేస్తే పంటలు సమృద్ధిగా సాగు చేసుకుని వృద్ధి చెందుతారన్నారు. అనంతరం తహసీల్దార్ జగదీష్‌బాబుకు వినతిపత్రం అందించారు.

ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి

- ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రాజారెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందిస్తున్న సమన్వయకర్త రాజారెడ్డి

వింజమూరు(ఉదయగిరి): గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధిచేకూరిందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం వింజమూరు సచివాలయం-1 పరిధిలో ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాజారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అవ్వా తాతలకు పింఛను అందిందా, అక్క చెల్లెమ్మలకు చేయూత మీ ఖాతాల్లో జమయిందా, ఆరోగ్యశ్రీ పథకం ఆదుకుందా.. అమ్మఒడి ద్వారా లబ్ధి పొందుతున్నారా అంటూ ఆరా తీశారు. అందరూ ప్రభుత్వం ద్వారా అన్ని పథకాలు అందుతున్నాయని ఆనందంగా సమాధానం చెప్పారు. ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌లు అందజేశారు. రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తూ పేద ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తున్నారన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజలకు వంద శాతం సంక్షేమం, అభివృద్ధి జరగాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సచివాలయాల పరిధిలో కేటాయించే నిధుల ద్వారా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మొద్దు

గత ఎన్నికల్లో ఆరు వందల అబద్ధాలాడి అధికారం చేజిక్కించుకుని ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో నెరవేర్చలేని చరిత్ర చంద్రబాబుదని రాజారెడ్డి గుర్తు చేశారు. ఇచ్చిన మాట కోసం కట్టుబడి రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజలతో శభాష్ అనిపించుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని తేడా వివరించారు. సీఎం జగనన్న ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాకుండా ప్రజలకు అనేక పథకాలు అమలు చేశారన్నారు. ఆరోగ్య వంతమైన సమాజం కోసం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా, విద్యార్థులకు పాఠశాలల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరో సారి ఆదరించాలని ఆయన కోరారు. సచివాలయంలో రికార్డులు తనిఖీచేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడుతూ ప్రజలకు ఇంకా మనం చేయాల్సింది ఏమైనా ఉందా అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, మండల కన్వీనరు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నేతలు పల్లాల కొండారెడ్డి, గువ్వల కృష్ణారెడ్డి, మద్దూరు బాబు, కాలేషా, తహసీల్దార్ చొప్పా రవీంద్ర బాబు, ఎంపీడీఓ రాజేష్‌బాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నారంపేటలో భూముల రీసర్వే ప్రారంభం



నారంపేటలో డ్రోన్ ద్వారా భూముల రీసర్వే చేస్తున్న సర్వే అధికారులు

ఆత్మకూరురూరల్: మండలంలోని నారంపేటలో వైఎస్సార్ జగనన్న భూరక్ష, భూహక్కు పథకంలో భాగంగా సోమవారం భూముల రీసర్వే ప్రక్రియను ప్రారంభించారు. గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరినాయుడు కార్యక్రమంలో పాల్గొని తమ గ్రామ భూముల వివరాలను సర్వే సిబ్బందికి తెలియజేశారు. రీసర్వే డ్రోన్ పైలెట్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రస్తుతం 1680 ఎకరాలకు డ్రోన్ ద్వారా రీసర్వే చేశామని తెలిపారు. గ్రామస్తులు, రైతులు సహకారంతో సమగ్రంగా సర్వే చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్లు గౌస్, రాజశేఖర్, రమేష్, శ్రీధర్, నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

వరికుంటపాడు: ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది దోమల నియంత్రణ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారిణి కరీష్మా మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఆడ ఎనాఫిలీస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖర రాజు, సూపర్‌వైజర్ వెంకటయ్య, స్టాఫ్‌నర్స్ రాజేశ్వరి, ఆరోగ్య సహాయకుడు శ్రీను, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పార్టీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని 15, 16, 18 వార్డుల సచివాలయం పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు కోరారు. ఎమ్మెల్యే కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులతో కలిసి నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇప్పటికే వేలాది సమస్యలు గుర్తించి కొన్ని పరిష్కరించగా, మరికొన్ని పరిష్కార దిశలో ఉన్నాయన్నారు. నవరత్నాల పథకాల్లో ఏ మేరకు లబ్ధిదారులకు అందినది స్వయంగా వారితోనే మాట్లాడి లోటు పాట్లు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. రెండు రోజుల పాటు సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, నోటి వినయ్ కుమార్‌రెడ్డి, షేక్ రహీం, ముతీవర్, కలాం పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ సద్వినియోగం చేసుకోండి



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి

అల్లూరు: దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో ఉచితంగా ఇస్తున్న టైలరింగ్ శిక్షణను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్ఆర్ గ్రూప్ చైర్మన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. స్థానిక ట్రస్ట్‌లో సోమవారం టైలరింగ్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను ఇవ్వడంతో పాటు కెనరా బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సహకారంతో కుట్టుమెషిన్లను పంపిణీ చేస్తామన్నారు. బ్యాంకుకు నెలనెలా సకాలంలో రుణాలను చెల్లించాలన్నారు. అనంతరం రాజరాజేశ్వరి కన్‌స్ట్రక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత రావూరు రాము అందించిన స్కూల్ బస్‌ను ప్రారంభించారు. ట్రస్ట్ ద్వారా ఎంతో మందికి ఉచితంగా విద్య అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, మేనేజర్ అనిల్‌కుమార్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రరావు, ఏపీజీబీ మేనేజర్ టీవీ కృష్ణకుమార్, కెనరా బ్యాంకు మేనేజర్ అడారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం సోమశిలలో సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి దాతృత్వంలో పేద గిరిజన విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. సోమశిల గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.సంపూర్ణమ్మ యూనిఫాంను అందించారు. ఆమె మాట్లాడుతూ జెడ్పీటీసీ సభ్యుడు విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. విద్యార్థులకు 63 జతల యూనిఫాం పంపిణీ చేశామన్నారు. ఎంఈఓ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ఐఎఫ్‌పీ పనితీరును పరిశీలించామన్నారు. అనంతరం ఎంఈఓ బాలకృష్ణారెడ్డిని, ఎంపీపీని, పాఠశాల ప్రిన్సిపల్ వెంకటసుబ్బారెడ్డిని సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత పి ఈశ్వరయ్య పాల్గొన్నారు.